# వానపాములు

అది యాభై కుటుంబాలున్న ఓ గూడెం.

పెంకుటిండ్ల మధ్యలో పాడైపోతున్న ఓ భవనం. అందులో కుల పంచాయతీ జరుగుతోంది. పెద్దల వాగ్వివాదాలు జరుగుతున్నాయి. మధ్యలో కల్లుకుండలొస్తున్నాయి. పరిసరాలంతా కల్లు వాసనతో నిండి, ఈగలు జొబ్బుమంటూ తిరుగుతున్నాయి.

ఆ భవనం... ఏడాది కింది వరకూ ఓ ప్రాథమిక పాఠశాల. ఒకటి నుంచి అయిదు తరగతులకు పది మందిలోపే పిల్లలున్నారని ప్రభుత్వం పాఠశాలని మూసేసింది.

మూతబడ్డ స్కూళ్లన్నీ... కమ్యూనిటీ హాళ్లుగా మారిపోతున్నాయి.

అలాగే ఆ స్కూల్లో చదివే పది మంది పిల్లల్లో ఇద్దరు పశువుల కాపర్లయ్యారు. రెండొందలు ఫీజు కట్టే స్థాయిలో ఉన్న ఇద్దరు పిల్లలు పక్క ఊర్లో ప్రైవేటు స్కూల్లో చేరారు. రోజూ స్కూల్ వ్యాన్ రాగానే వెళ్లిపోతారు. ఒకడు అమ్మమ్మ ఊరికెళ్లి చదువుకుంటున్నాడు. మిగిలిన అయిదుగురు రాజు, మల్లయ్య, పవన్, శేఖర్, చందు... రోజూ గాలాలేసి చేపలు పట్టడం, వాటిని అమ్ముకొని వచ్చిన డబ్బుతో ఏమైనా కొనుక్కోవటం... ఏడాదిలో బాగా అలవాటైన పనులు.

రాత్రి వర్షం పడటంతో స్కూలు మైదానమంతా పచ్చిగా ఉంది. అక్కడక్కడా సర్కార్ తుమ్మలు, పిచ్చి మొక్కలు పెరిగాయి. చీమలు పుట్టలు పెట్టాయి. 'ఎర'ల్ని తవ్వడానికి ఇనుప చువ్వతో వచ్చారు పవన్, శేఖర్, మల్లయ్య. చందుగాడు పతంగితో ఆడుతున్నాడు.

రాజుగాడు ఏదో పేపర్ ముక్క దొరికితే చదువుకుంటూ వచ్చాడు.

"రాజుగానికి స్కూలు బందయినా చదువంటే ఇష్టం పోలేదురా! ఏ పేపర్ ముక్క దొరికినా చదువుతూనే ఉంటాడు" ఇనుపచువ్వతో భూమిని తవ్వుతూ చెప్పాడు శేఖర్.

"వాడికి అయిదో తరగతి చదవాలని బాగా ఉండే" గాలం వైరుకి చొప్పబెండు ముక్కని కడుతూ అన్నాడు మల్లయ్య.

"ఇప్పుడు పేపర్లో చదివింది మనకు వినిపిస్తాడు చూడు" నవ్వుతూ అన్నాడు పవన్.

రాజు రాగానే వాళ్లు ముగ్గురూ ముసిముసిగా నవ్వారు. అవేవీ పట్టించుకోకుండా "రేయ్ ఇది చదువుతా! వినండి. తప్పులు పోతే చెప్పండి" అంటూ చదవటం మెదలెట్టాడు.

"తెలుగు భాషని విశ్వభాషగా చేయాలని హైదరాబాద్‌లో మేధావులు, భాషాభిమానులు తీర్మానించారు. మూడువేల సంవత్సరాల చరిత్ర వున్న తెలుగు భాషని ఎవరు విస్మరించినా నేరమే అవుతుందని ప్రముఖులంతా పేర్కొన్నారు. ఇతర దేశాల విశ్వవిద్యాలయాల్లో తెలుగుని ప్రవేశపెట్టాలని తీర్మానించారు. పుస్తకాలు చదవటం వల్లే భాష పరిధి విస్తరిస్తుందని ప్రముఖ... ఫ్చ్... పేపర్ చినిగిపోయిందిరా!" అన్నాడు నిరాశగా.

వాళ్లు వాని మాటల్ని పట్టించుకోలేదు.

"ఒరే రాజూ! ఆ పేపర్ ముక్క ఇటివ్వు... దీన్ని దాంట్లో చుట్టేద్దాం" చెప్పాడు పవన్ పచ్చి మట్టిలోంచి బంగారు వర్ణంలా మెరిసిపోతున్న 'ఎర'ని బయటికి తీస్తూ.

"నేనివ్వను" అని జేబులో పేపర్‌ని పెట్టేసుకున్నాడు రాజు.

శేఖర్ దాన్ని గాలానికి గుచ్చుతుంటే... అది విలవిల కొట్టుకుంది.

"మట్టిలో కూడా అదెంత స్వచ్ఛంగా ఉందిరా... ఎరల్ని వానపాములంటారని టీచర్ చెప్పింది కదా" అన్నాడు మల్లయ్య.

"అవునవును" అన్నారు రాజు, శేఖర్.

ఇంకొన్ని వానపాముల్ని తవ్వారు. మరో రెండు గాలాలకు గుచ్చారు.

పవన్ ఇంకొద్దిగా మట్టిని తవ్వాడు... విచిత్రంగా ఏనుగు తొండంలా వున్న ఆకారాలు రెండు బయటపడ్డాయి. అవి మట్టికొట్టుకొని పోయినట్టు ఉన్నాయి. నలుగురూ విచిత్రంగా చూస్తుంటే చందుగాడు పతంగిని వదిలిపెట్టి పరుగెత్తుకొచ్చాడు.

శేఖర్ వాటిని చేతుల్లోకి తీసుకున్నాడు. రాజు బోరింగ్ దగ్గరికెళ్లి నీళ్లు తెచ్చి

వాటిని కడిగాడు. అవి మిణుగురు పురుగుల్లా వెలిగిపోతున్నాయి. ఆ వెంటనే వాటి కళ్లల్లోంచి ధారాపాతమైన నీళ్లు శేఖర్ దోసిలిని తడిపేశాయి. అయోమయంగా మొహాలు చూసుకొని "మీరెవరు? ఎందుకేడుస్తున్నారు?" అని అడిగారు పవన్, మల్లయ్య.

అవి చాలాసేపు వెక్కివెక్కి ఏడ్చాయి.

ఆ అయిదుగురి కళ్లల్లోనూ నీళ్లొచ్చాయి. కాసేపటికి తేరుకొని "చిన్న గణపతి తొండంలా ఉన్నారు. ఎవరు మీరు ?" అనడిగాడు శేఖర్.

అవి ఏడుస్తూనే "మేమెవరమో మీకు తెలీదు కదూ ! మీరు చదువుకున్నవాళ్లేనా?" అనడిగిందొక తొండం.

అయిదుగురూ కోరస్‌గా "ఓ!" అన్నారు.

"రాజుగాడు నాలుగోతరగతితో ఆపేశాడు. నేనేమో మూడు, శేఖర్, పవన్ అయిదు, మల్లిగాడు రెండో తరగతి చదివాం" గర్వంగా చెప్పాడు చందు.

"స్కూల్ మూసెయ్యకపోతే ఇంకా చదివేవాళ్లం" నిరాశగా అన్నాడు రాజు.

"మమ్మల్ని లు, లూ అనేవాళ్లు. మీ అక్షరమాలలో 'ఋ' తర్వాత ఉండేవాళ్లం. మమ్మల్ని ఎప్పుడో ఏరి పారేశారు" అన్నాయి కళ్లనీళ్లతో.

"ఎందుకు?" అన్నారు ముక్త కంఠంతో. "ఏమో!" అన్నాయవి ఏడుస్తూనే.

"ఇన్నేళ్లయినా మీరు చచ్చిపోలేదా?" అనడిగాడు శేఖర్ ఆశ్చర్యంగా.

"మేం అక్షరాలం కదా! మాకు నాశనం ఉండదు" అన్నాయి.

ఈలోగా తవ్విన మట్టిలోంచి తోక ఉన్న బొంత పురుగులాంటిది పాక్కుంటూ వచ్చి, రాజుగాడి దోసిలి చేరింది. అదంతా మట్టికొట్టుకు పోయి ఉంది.

"ఇది మన 'ఋ' లాగుంది కదూ!" ఆశ్చర్యపోతూ అరిచాడు మల్లయ్య.

"అవును. మేం ఒకప్పుడు జంట అక్షరాలం. ఋ పక్కన ఉండే ౠ ని,. నన్నూ భూమిలో పాతిపెట్టేశారు. మమ్మల్ని విడదీసిన పాపం తప్పక తగుల్తుంది" అంది ఏడుస్తూ.

"అవును. మా తెలుగులో ఒక్క 'ఋ'యే ఉంది" అన్నాడు శేఖర్ నొచ్చుకుంటూ.

"మీరింకా ఎందరున్నారు?" అనడిగాడు పవన్.

"మీ పాఠశాల మైదానం తవ్వితే ఇంకా బయటపడతాయేమో"! బాధగా అంది ౠ.

ఇంకొంచెం మైదానం తవ్వారు. నెలవంక లాంటి మరో ఆకారం బయటపడింది. అందరూ దాని చుట్టూ గుమిగూడారు. దాని మీద పేరుకుపోయిన మట్టిని తుడిచారు.

"నువ్వెవరు? నిన్ను కూడా మేమెప్పుడూ చూళ్లేదు" అన్నారు చందు, మల్లయ్య.

అది దుఃఖాన్ని అణిచి పెట్టుకుంటూ నవ్వడానికి ప్రయత్నించింది.

"నన్ను అరసున్నా అంటారు. తెలుగు భాషకి మూలధనమైన మమ్మల్ని తొక్కేశారు"

"నువ్వు లేకుండా మేం చదువుకోలేమా?" అడిగాడు శేఖర్.

"చదువుకోవచ్చు. కాని అర్థాలు మారిపోతాయిరా కన్నా! మీ ఇంటి ముందుండే అరుగులో నేనుండాలి.. అప్పుడే అది నిజం... లేదంటే 'వెళ్లు' అనే అర్థం వస్తుంది. అంతెందుకురా! వెలుగులో నేనుండాలి. మీరు చెప్పే వెలుగుకి అంటే కంచె అని అర్థం. పేటలో నేనున్నప్పుడే మీ వీధి అవుతుంది. లేదంటే వరుస అవుతుంది. వేగు, నూగు, కలుగు, తరుగు... ఇలా అన్నింటిలో నేనుండాలిరా. లేదంటే మీరు పలుకుతున్న పదాలకు అర్థాలు వేరే ఉన్నాయి" అంది ఉనికి కోల్పోయిన బాధతో.

వాళ్లు సంభ్రమాశ్చర్యాలతో వింటున్నారు. కాసేపటికి దాన్ని శేఖర్‌గాడి దోసిట్లో వేశారు. మళ్లీ మట్టిని తవ్వటం మొదలెట్టారు.

అరగంట తర్వాత శిలాజాల్లా మరో రెండు బయటపడ్డాయి.

అవి చ... జ...

కాని ఆ రెండింటిపైనా త ఒత్తు లాంటి గుర్తులున్నాయి. వాటి మీద మట్టిని తుడిచి "మీలాంటి చ, జ మాకు తెల్సు. మీరెవరు?" అనడిగాడు రాజు.

"మేం ముగ్గురం ఉండేవాళ్లం. నేను మధ్యలో ఉండేదాన్ని. నేను పనికిరానని పాతరేశారు. నేను వచ్చే పదాల్ని మీచేత తప్పుగా పలికిస్తున్నారు" ఆవేశంగా, ఆవేదనగా అంది.

"మీ మనుషుల్లో కూడా నడిపోడు ఎందుకూ పనికిరాడంటారు... ఆస్తి పంపకాల్నించి తల్లిదండ్రుల అంత్యక్రియలు నిర్వహించే వరకు ! అలాగే ఇద్దరి నడుమ ఉన్నందుకు మా పరిస్థితి అలాగే అయింది. చదరం, జల్లెడ లాంటి పదాలు మేం లేకుండా చదివిస్తున్నారు" కళ్లు తుడుచుకుంటూ అంది.

"మేం లేకుండా చాలా పదాలు లేవు. కాని మమ్మల్ని చంపేసి అర్థాలు మార్చేస్తున్నారు. మీ ఇంట్లోంచి మీ తమ్ముడినో, చెల్లెలినో ఎక్కడైనా వదిలిపెట్టేసి వస్తే మీకెలా ఉంటుంది?" అంది బాధగా. అందరి కళ్లలోనూ నీళ్లు తిరిగాయి...

ఇంతలో బక్కచిక్కిపోయి... ఒంటరిగా తప్పిపోయి తిరుగుతున్న మరో అక్షరం అక్కడికి వచ్చింది. పలకరిస్తే ఏడ్చేలా పుట్టెడు దుఃఖంతో ఉంది. వాళ్లు దాన్ని వింతగా చూశారు.

"కొన్నాళ్లయితే నాకూ వీళ్ల గతే పట్టేలా ఉంది. నా పేరు క్ష. ఒకటో తరగతి నుంచి అయిదో తరగతి వరకు మీ వర్ణమాలల్లో నా పరిచయం ఎక్కడా లేదు. అసలు నేను లేకుండా 'అక్షరం' అనే పదమెక్కడుందిరా!" అని తలబాదుకుంది.

వర్ణమాలలోంచి రంగురంగుల పూలు రాలిపోయినట్టు. కాదు... కావాలనే చిదిమేసినట్టు వాటన్నిటినీ చూస్తుంటే జాలేసింది వాళ్లకి.

మళ్లీ మట్టిని తవ్వటం మొదలెట్టారు.

ఈసారి మరింత లోతుగా తవ్వారు. మరో భారీ ఆకారం లాంటి అక్షరం బయటపడింది. కూచున్న 'లాఫింగ్ బుద్ధ' లాంటి అక్షరమది. ఇన్నాళ్లూ ఊపిరందనట్లు ఆయాస పడుతోంది. మట్టిని తుడిచేసి, దానికి నీళ్లు తాగించారు.

"నువ్వెవరు?" ఆసక్తిగా అడిగారు.

అది విరక్తిగా నవ్వింది. అయినా కన్నీళ్లు జలజలా రాలాయి.

"ఎవరు నువ్వు?" మళ్లీ అడిగారు.

"మీ వర్ణమాలలోని చివరి అక్షరాన్నిరా!" గొంతు పూడుకుపోతుంటే జీరబోయినట్టు చెప్పింది.

"అవునా! మా వర్ణమాలలో చివరి అక్షరం 'హ' మాత్రమే ఉంది." అన్నాడు రాజు.

"నేను 'ఱ' ని...నేను లేకుండా చాలా పదాలు లేవురా! ఉచ్చారణతో సంబంధం లేకుండా నేర్పేది భాష ఎలా అవుతుందిరా! 'ర' అనే అక్షరం ఉంది కదా! ఇంకా నువ్వెందుకు అని నన్ను తన్ని తగలేశారు" అంటూ బావురుమంది.

పిల్లలు ఆ అక్షరాల కన్నీళ్లు తుడిచారు.

వాటికి తలంటుపోశారు. అవి మొక్కలై నాటుకున్నాయి. క్షణాల్లో వెలుగు పూలై వికసించినాయి. మా ఉచ్ఛారణ ఇలా ఉంటుందంటూ పాటలై పల్లవించాయి.

వర్ణమాలలోంచి బహిష్కరించినందుకు నిరసనగా నినదించాయి.

భాషని చంపేయడానికి ఒక్కో అవయవాన్ని నరికేస్తున్నారని దుఃఖించాయి.

పిల్లలు ఓదార్చారు... అవి వాళ్లను ముద్దాడాయి.

సరిగ్గా అప్పుడే ... ఆ మైదానంలోకి...

పొరుగూరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ వ్యాన్ వేగంగా వచ్చింది. కొంచెం ఆగి, రివర్స్‌లో తిరిగింది. మళ్లీ ముందుకొచ్చి ఆగింది.

వెలుగు పూల మొక్కలు... వ్యాన్ కింద పడి నుజ్జునుజ్జయ్యాయి.

శేఖర్, రాజు, పవన్, మల్లయ్య, చందు హతాశులయ్యారు.

వ్యాన్ డ్రైవర్ భయంకరంగా హారన్ కొడుతుంటే, బరువు పుస్తకాల బ్యాగ్‌తో ఓ కుర్రాడు పరుగు పరుగునా వచ్చి వ్యానెక్కాడు. నోట్లో అన్నం ముద్ద మింగనేలేదు.

"రెయిన్... రెయిన్... గో అవే..."

ఇంకా బట్టీ పడుతూనే ఉన్నాడు. బాలవాక్కుకు బెదిరి, మబ్బులు చెల్లాచెదురవుతున్నాయి. అక్షరాలు మళ్లీ భూమిలో పడి నలిగిపోయాయి. రాజుగాడికి కోపం, దుఃఖం కలగలిపి తన్నుకొచ్చాయి.

వ్యాను కదిలింది.

స్కూల్ వ్యాన్ మీదకి రాయి విసరాలని చుట్టూ చూశాడు. ఎక్కడా కన్పించలేదు. జేబులో ఉన్న కాగితం తీసి, ఉండలా చుట్టి బలంగా విసిరేశాడు.

'తెలుగు భాషని విశ్వభాషగా చేయాలనే' ప్రసంగ వ్యాసం వ్యాను టైర్ల కింద పడి చితికిపోయింది.